క్లుప్తంగా

ఎంపీకి ఆహ్వానం



డోర్నకల్: గొల్లచర్ల గ్రామంలో మార్చి 1నుంచి 3వరకు జరిగే బొడ్రాయి ప్రతిష్ఠ వేడుకలకు హాజరుకావాలంటూ మహబూబాబాద్ ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వాహకులు ఎంపీ కవితను కలిసి ఆహ్వానపత్రం అందజేశారు. గొర్ల సత్తిరెడ్డి, చేరెడ్డి బిక్షంరెడ్డి, డోర్నకల్ మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నున్నా రమణ, పట్టణ అధ్యక్షుడు కత్తెరసాల విద్యాసాగర్, తదితరులు ఉన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం



మహబూబాబాద్ రూరల్: కాలజ్ఞాన తత్వవేత్త శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాములవారు గోవిందమాంబదేవి అమ్మవారి కల్యాణోత్సవాన్ని గార్గేయాగమానుసారంగా, మనుసూత్రోక్త ప్రకారంగా శనివారం రాత్రి వైభవోపేతంగా నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకుడు కాయితోజు పరిపూర్ణాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ పమ్మి సనాతనాచారి అనురాధ, పమ్మి నాగబ్రహ్మాచారి పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమ స్థాపించాలి



బయ్యారం: ఇనుపరాయి గనులున్న బయ్యారంలో కేంద్ర ప్రభుత్వం ఉక్కు పరిశ్రమను నిర్మించాలని సేవాలాల్ సేన జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్య రవినాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం బయ్యారంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ సొంత రాష్ట్రం గుజరాత్ ప్రయోజనాల కోసం ఛత్తీస్‌గఢ్‌లోని బైలడిల్లా గనులను కేటాయించటం సరికాదన్నారు. సమావేశంలో నాయకులు భద్రు, రాము, కిషన్, భిక్షం, మల్సూర్, రమేష్, సర్వణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సుభిక్షంగా ఉండాలి



మరిపెడ రూరల్: పాడి పంటలు, సుఖసంతోషాలతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మరిపెడ మండలం అబ్బాయిపాలెం శివారు కొండపై స్వయంభుగా వెలసిన అగస్తేశ్వర స్వామి వారి రెండోరోజు జాతరను ఆదివారం ఎమ్మెల్యే, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్‌తో కలిసి సందర్శించారు. అనంతరం కొండపై గల అగస్తేశ్వర ఆలయంలోని శివపార్వతులకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు జరిపించారు. కార్యక్రమంలో సర్పంచ్ జినక మణి ఇద్దయ్య, వెంకట్‌రెడ్డి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ వెంకటరామారావు, నాయకులు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ దందాను అరికట్టాలి



గార్ల: ఏజెన్సీ మండల కేంద్రమైన గార్లలో అక్రమ రియల్ ఎస్టేట్ దందాను అరికట్టడంతో అధికారులు వైఫల్యం చెందారని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు వాంకుడోత్ మంగీలాల్ ఆరోపించారు. ఆదివారం గార్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరులు ఏజెన్సీ చట్టాన్ని తూట్లు పొడిచి వ్యవసాయ భూముల్లో అక్రమంగా వెంచర్లు చేసుకొని దర్జాగా ప్లాట్లు విక్రయిస్తున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడంలో మతలబేంటో అర్థం కావడం లేదన్నారు. అక్రమ వెంచర్లపై అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి వెంచర్లను తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు గంగావత్ అశోక్‌నాయక్, సర్వన్‌నాయక్, వీరన్ననాయక్, సుమన్, రమేష్, తరుణ్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేత

కురవి: మండల కేంద్రం శివారు లింగ్యాతండా గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవానికి డోర్నకల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బాధ్యుడు మాలోత్ నెహ్రూనాయక్ రూ.50వేల విరాళం ఆదివారం సర్పంచ్ బాదావత్ రవికి అందజేశారు. వార్డు సభ్యులు రాములు, కిర్రూ, వింగి, సతీష్, హనుమాన్ పాల్గొన్నారు.

ఛత్రపతి జీవితం యువతకు ఆదర్శం



మహబూబాబాద్ అర్బన్: నివాళులర్పిస్తున్న బీజేపీ, బీజేవైఎం నాయకులు

మహబూబాబాద్ అర్బన్: మనువాదాన్ని కూల్చిన చక్రవర్తి ఛత్రపతి శివాజీ మహరాజ్ అని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ దార్ల శివరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఎస్పీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం శివాజీ జయంతిని పురస్కరించుకొని బీఎస్పీ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఎస్పీ అసెంబ్లీ కార్యదర్శి సీత సాయికిరణ్, జిల్లా కార్యదర్శులు దార ప్రసాద్‌రావు, పాల్వాయి బుచ్చిరాములు, అసెంబ్లీ మహిళా కన్వీనర్ ఆకారపు ఉపేంద్ర, ప్రధాన కార్యదర్శి ఉబ్బెపెల్లి శ్రావణ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు చెన్నూరి విజయలక్ష్మి, పట్టణ అధ్యక్షురాలు యార్వ స్రవంతి పాల్గొన్నారు. బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

మరిపెడ రూరల్: ఛత్రపతి శివాజీ జీవితం యువతకు ఎంతో ఆదర్శప్రాయమని డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. మరిపెడ మండలం ఎల్లంపేటలో శివాజీ జయంతి వేడుకలను గ్రామంలోని శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డీఎస్ రవిచంద్ర, సర్పంచ్ తాళ్లపల్లి శ్రీనివాస్, ఎంపీటీసీ రఘురాములు పాల్గొన్నారు.

గూడూరు: మండల కేంద్రంలో శివాజీ జయంతి సందర్భంగా యువకులు బైక్‌ర్యాలీ నిర్వహిస్తూ నినాదాలు చేశారు. భజరంగ్ దళ్ నాయకులు పింగిళి శ్రీనివాస్, మేరెడ్డి సురేందర్ మాట్లాడారు. అనంతరం స్థానిక సీహెచ్‌సీలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయగా, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరన్న మానుకోట రెడ్‌క్రాస్ సంస్థకు అందించారు. సర్పంచ్ నూనావత్ రమేష్‌నాయక్, ఎడ్ల నరేష్‌రెడ్డి, పలువురు యువకులు రక్తదానం చేశారు.



మరిపెడ రూరల్: వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రెడ్యానాయక్, తదితరులు



గూడూరులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న భజరంగ్ దళ్ కార్యకర్తలు

దంతాలపల్లి: శివాజీ మహరాజ్ స్ఫూర్తితో బహుజనులు ఉద్యమించాలని బీఎస్పీ మానుకోట జిల్లా అధ్యక్షుడు తేజావత్ అభినాయక్ అన్నారు. మండలంలోని దాట్ల గ్రామంలో శివాజీ జయంతి వేడుకలు నిర్వహించారు.

పాదయాత్రను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న విజయసారథి

మహబూబాబాద్ రూరల్: రాష్ట్ర విభజన హామీలు, బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీల సాధన కోసం జరుగనున్న సీపీఐ మహాపాదయాత్రను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి పిలుపునిచ్చారు. సీపీఐ మహబూబాబాద్ అర్బన్ వర్క్ షాప్ సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్ అధ్యక్షతన అనంతాద్రి వేంకటేశ్వర స్వామి వారి దేవాలయ ప్రాంతంలో ఆదివారం నిర్వహించారు. విజయసారథి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్ సారథిరెడ్డి మాట్లాడుతూ.. మార్చి 17వ తేదీ నుంచి సీపీఐ మహాపాదయాత్ర ప్రారంభం అవుతుందని తెలిపారు. వర్క్‌షాపులో వార్డు కౌన్సిలర్ నీరజధర్మన్న, రేషపల్లి నవీన్, వెంకన్న, సాంబలక్ష్మి, రవి, శ్రావణ్, నర్ర శ్రావణ్, ఫాతిమా, మేక వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చాలి



మాట్లాడుతున్న సంజీవ్‌నాయక్

గార్ల: బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని సేవాలాల్ సేనా వ్యవస్థాపక అధ్యక్షులు భూక్యా సంజీవ్‌నాయక్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఆదివారం మండలంలోని పూమ్యాతండా, అంజనాపురం గ్రామాల్లో నిర్వహించిన సేవాలాల్ జయంతి వేడుకల వారోత్సవాల సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తొలుత ఆయనకు సేవాలాల్ సేనా సంఘం ఆధ్వర్యంలో గ్రామాల్లో ఆయనకు గిరిజన మహిళలు నృత్యాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం భోగ్‌బండారో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం యూత్ మండల అధ్యక్షుడు గూగులోత్ సాయికుమార్, హరినాయక్, కిషన్‌నాయక్, ఈశ్వర్, సాయికుమార్, శివ, మోహన్, వెంకన్న, రావూజీ, తదితరులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోం..



కేసముద్రం: మాట్లాడుతున్న నజీర్‌అహ్మద్

కేసముద్రం: ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్‌పై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోబోమని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండి.నజీర్ అహ్మద్, ఎంపీపీ వోలం చంద్రమోహన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. వైఎస్సార్ తెలంగాణ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, ఇష్టమొచ్చినట్లుగా ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌పై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా షర్మిల క్షమాపణలు చెప్పాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనాథ్‌రెడ్డి, మండలపార్టీ ప్రధానకార్యదర్శి కముటం శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు గుగులోతు వీరునాయక్, నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, ఎంపీపై వ్యాఖ్యలు సరికాదు

నెహ్రూసెంటర్: ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, ఎంపీ మాలోత్ కవితపై వైఎస్ షర్మిల చేసిన వ్యాఖ్యలు సరికావని సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరావత్ వెంకన్ననాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ సెంటర్‌లో సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టి ఎమ్మెల్యే, ఎంపీపై చేసిన వాఖ్యలను ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుగులోత్ నందులాల్‌నాయక్, రాంబాబు, సురేష్, దిలీప్, రెడ్యానాయక్, లక్ష్మీబాయి పాల్గొన్నారు.

ఆగ్రహించిన బీఆర్ఎస్ కార్యకర్తలు

నెల్లికుదురు: వైఎస్సార్ టీపీ రాష్ట్ర నాయకురాలు వైఎస్ షర్మిల ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం మండల కేంద్రంలో వైఎస్సార్ టీపీ పార్టీ జెండాలను దహనం చేశారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పరుపాటి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. నోరుకు అడ్డూ అదుపులేకుండా ఇతరులపై ఆరోపణలు చేసే ముందు వెనకా ముందు చూసుకొని మాట్లాడాలని వైఎస్ షర్మిలను హెచ్చరించారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

మహబూబాబాద్ రూరల్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శివాలయాల్లో శివపార్వతుల కల్యాణ మహోత్సవాలు శనివారం రాత్రి అత్యంత వైభవోపేతంగా జరిగాయి. పార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు రంగావఝుల సుధాకరశాస్త్రిసునీత, చిట్టా శ్రీకాంత్‌శర్మ కల్యాణం నిర్వహించారు. భక్తమార్కండేయ శివాలయంలో ర్చకుడు కొత్తూరి నర్సింహమూర్తిశర్మ, స్వయంభూ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రధాన అర్చకులు కల్యాణం జరిపించారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు గద్దె రవి, చైర్మన్ అలుగువెల్లి వీరభద్రం, మున్సిపల్ వార్డు కౌన్సిలర్ గద్దె నీరజ, భక్తులు పాల్గొన్నారు.

భక్తులకు మహా అన్నదానం

కురవి: మండల కేంద్రంలో భద్రకాళీ సమేత శ్రీవీరభద్రస్వామి కల్యాణం అనంతరం ఆదివారం సంత ఆవరణలో హైదరాబాద్‌కు చెందిన శ్రీవీరభద్రస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు మహాఅన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతీ ఏటా సేవా సమితి అధ్యక్షుడు షాబాద్ వెంకటేశం, కాసుల అనసూయమ్మల ఆధ్వర్యంలో అన్నదానం చేస్తున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బాదావత్ రామునాయక్, వార్డు సభ్యుడు నూతక్కి నర్సింహారావు, దామోదర్‌రెడ్డి, సేవా సమితి సభ్యులు కాసుల వినోద్, మల్లికార్జున్, రమణ, చంద్రుడు, విజయ్‌పటేల్, శకుంతల పాల్గొన్నారు.



మహబూబాబాద్ రూరల్: కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గార్ల: మండలంలోని పుల్లూరు శివాలయంలో శివపార్వతుల కల్యాణం అనంతరం ఆదివారం నిర్వహించిన అన్నదానం కార్యక్రమాన్ని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు గంగావత్ లక్ష్మణ్‌నాయక్ ప్రారంభించారు. కార్యక్రమంలో శివాలయం సేవా కమిటీ అన్నదానం నిర్వాహకులు, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, నరసింహ, ప్రభాకర్ పాల్గొన్నారు.

దంతాలపల్లి: మండలకేంద్రంలో గల శ్రీభవాని సమేత రామలింగేశ్వర స్వామిని ఆదివారం కనుల పండువగా ఊరేగింపు నిర్వహించారు.



దంతాలపల్లి: రామలింగేశ్వర స్వామిని ఊరేగిస్తున్న భక్తులు



కురవి: అన్నదానం చేస్తున్న సమితి సభ్యులు

శివపార్వతుల ఊరేగింపు

బయ్యారం: శివరాత్రి సందర్భంగా బయ్యారంలోని శివాలయంలో కల్యాణం జరిగిన శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ఆదివారం రాత్రి వీధుల్లో ఊరేగించారు.

'అధిక ధరలకు యూరియా విక్రయం'



మాట్లాడుతున్న లింగన్న

దంతాలపల్లి: మండలం రైతుల పంటపొలాలకు అవసరమైన యురియా బస్తాలపై ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు అమ్ముతున్నారని ఏఐకెఎంఎస్ తొర్రూరు డివిజన్ అధ్యక్షులు ఊడుగుల లింగయ్య అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. దంతాలపల్లి, చిన్నగూడూరు, మరిపెడ, నర్సింహులపేట మండలాల్లో ఫర్టిలైజర్ షాపులతోపాటు ఆగ్రోస్ షాపుల యజమానులు రూ.266 ఉన్న యూరియా బస్తాను రూ.300నుంచి రూ.350 వరకు వసూలు చేస్తున్నారని తెలిపారు. అధికారులు చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఏఐకెఎంఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపారు. నాయకులు యాకయ్య, కమలాకర్, షాజహాన్, సోమన్న, తదితరులు పాల్గొన్నారు.

కారు బోల్తా.. నలుగురికి గాయాలు



మలుపు వద్ద బోల్తాకొట్టిన కారు

కేసముద్రం: ప్రమాదవశాత్తు అదుపుతప్పి కారు బోల్తా కొట్టిన సంఘటన మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డులో మలుపు వద్ద ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ధన్నసరి గ్రామానికి చెందిన సందీప్, రంజిత్, శ్రీను, రాము అనే వ్యక్తులు తెల్లవారుజామున 4గంటల ప్రాంతంలో ధన్నసరి నుంచి కేసముద్రంస్టేషన్‌కు కారులో బయలుదేరారు. ఈక్రమంలో కేసముద్రంస్టేషన్‌లోని బైపాస్ రోడ్డు మీదుగా వెళ్తుండగా మలుపు వద్ద కారు అదుపుతప్పడంతో రోడ్డుపక్కన బోల్తా కొట్టింది. దీంతో కారు ధ్వంసం కాగా, అందులో ప్రయాణిస్తున్న నలుగురి కాళ్లకు, చేతులకు, తలకు స్వల్ప గాయాయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని మానుకోటలోని ఓ ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి పరిశీలించారు. కాగా ఇదే బైపాస్‌రోడ్డుపై ఇటీవల కారు అదుపుతప్పి వ్యవసాయ బావిలో పడగా, నలుగురు మృతిచెందిన విషయం తెలిసిందే. తరచు ప్రమాదాలు జరుగుతున్న ఈ బైపాస్‌రోడ్డు పక్కనున్న బావుల వద్ద, మలుపుల వద్ద సంబంధిత అధికారులు ప్రమాద హెచ్చరిక బోర్డులను, స్పీడ్ బ్రేకర్‌లను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వృద్ధురాలి ఆత్మహత్య

గార్ల: రైలు కిందపడి గుర్తుతెలియని వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం గార్ల–మహబూబాబాద్ రైల్వేస్టేషన్ మధ్య చోటుచేసుకుంది. డోర్నకల్ జీఆర్పీ ఎస్సై కె.శ్రీకాంత్ కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. గార్ల–మహబూబాబాద్ రైల్వేస్టేషన్ల మధ్య ఎగువ లైన్‌లో గుర్తుతెలియని 60సంవత్సరాల వృద్ధురాలు గుండ్రని కోల మొఖం, నలుపు తెలుపు వెంట్రుకలు, బొద్దుగా ఉన్న మహిళ గూడ్సు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతురాలి ఆచూకీ తెలియనందున మృతదేహాన్ని మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామని ఎస్సై తెలిపారు. ఎవరైనా వివరాలు తెలిసిన వారు ఈ సెల్ ఫోన్ 94406 27537, 94903 32143 నంబర్లను సంప్రదించగలరని ఎస్సై వెల్లడించారు.



గుర్తు తెలియని మృతదేహం

సమానపనికి సమాన వేతనం ఇవ్వాలి

నెహ్రూసెంటర్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నేడు (సోమవారం) కురవి మండల కేంద్రం నుంచి మహబూబాబాద్ కలెక్టరేట్ వరకు జరిగే గ్రామ పంచాయతీ కార్మికుల పాదయాత్రను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి కుమ్మరికుంట్ల నాగన్న ఆదివారం అన్నారు. ఈ సందర్భంగా నాగన్న మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్మికులు అనేక సంవత్సరాలుగా తక్కువ వేతనాలతో పని చేస్తున్నారన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, జీపీ ఉద్యోగులను పర్మినెంట్ చేసి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. జిల్లాలో ఉన్న అన్నిమండలాల గ్రామ పంచాయతీ కార్మికులు కురవి చేరుకుని అక్కడి నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు పాదయాత్ర ఉంటుందన్నారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

పార్టీలో చేరిక

బయ్యారం: న్యూడెమొక్రసీ చంద్రన్నవర్గానికి చెందిన కస్తాల శ్రీను ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపెల్లి రవి సమక్షంలో ఆదివారం పార్టీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి సూర్యం, నాయకులు భద్రయ్య, ధనుంజయ, పూర్ణ, జాని, శ్రీను, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు సైన్స్ టాలెంట్ టెస్ట్

డోర్నకల్: స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో సోమవారం మండలస్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి పూల్‌చంద్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 17న 8, 9వ తరగతి విద్యార్థులకు పాఠశాల స్థాయిలో సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించినట్లు తెలిపారు. పాఠశాల స్థాయి పోటీల విజేతలకు మండల స్థాయి పోటీలకు జెడ్పీహెచ్ఎస్‌లో ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు ఎంఈఓ తెలిపారు.

చలివేంద్రం ఏర్పాటు

మరిపెడ రూరల్: మరిపెడ మండలం అబ్బాయిపాలెం శివారు కొండపై స్వయంభుగా వెలసిన అస్తేశ్వర ఆలయంలోని మూడు రోజుల మహా శివరాత్రి జాతరను పురస్కరించుకొని 'సాయి అక్షిత గ్రూప్' చైర్మన్ సీహెచ్.రాజు ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు గంట శ్రీనివాస్, విజయకుమార్, లోకేష్, పాండురంగ, మార్కెట్ డైరెక్టర్ మహిపాల్‌రెడ్డి, ఇద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' కేంద్రాలు ఏర్పాటు చేయాలి

గార్ల: ప్రభుత్వ విద్యా సంస్థల్లో సైతం కంటి వెలుగు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాగం లోకేష్ ప్రభుత్వాన్ని ఆదివారం డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు వెంకటేష్, ఉదయ్‌కుమార్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

గుండం జాతర

కొత్తగూడ: గుండం శివాలయంలో పూజలు చేసేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. గుండంపల్లి గ్రామం నుంచి రెండు కిలోమీటర్ల మేర వాహనాలు ట్రాఫిక్ జామ్ అయ్యాయి. దీంతో భక్తులు శివుడికి అభిషేకం చేసేందుకు క్యూ కట్టారు.

సరుకుల అందజేత



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని బూడిదగడ్డతండాకు చెందిన గుగులోత్ చిరంజీవి కొద్ది రోజుల క్రితం అనారోగ్య కారణాలతో మృతి చెందగా అతడి కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. దీంతో స్పందించిన స్థానిక జైహత్తిరాం మహరాజ్ లంబాడ కులసంఘం సభ్యులు, మృతుడి స్నేహితులు, ఇతర నాయకులు ఆదివారం చిరంజీవి కుటుంబానికి ఏడాదికి సరిపడా నిత్యవసర సరుకులను సమకూర్చి అందజేశారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు

గంగారం: మండలకేంద్రంలోని గంగమ్మ గుట్టపై వెలసిన గంగమ్మతల్లికి కేయూ ప్రొఫెసర్ ఈసం నారాయణ, ముడిగ రాంచందర్, సర్పంచ్ సూరయ్య, మాజీ మండల అధ్యక్షుడు ఈసం సమ్మయ్యలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇర్ప సూరయ్య, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

డోర్నకల్: మండలంలోని అమ్మపాలెం గ్రామంలో ఆదివారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గ్రామస్థాయి క్రికెట్, వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. క్రీడా పోటీలను ప్రారంభించిన సీపీఎం పార్టీ మండల కార్యదర్శి ఉప్పనపల్లి శ్రీనివాస్ మాట్లాడారు. పోటీలకు యువత నుంచి విశేష స్పందన లభించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, ఉపాధ్యక్షుడు దేవేందర్, జిల్లా విద్యాశాఖ పర్యవేక్షకులు విత్తనాల సుధాకర్ పాల్గొన్నారు.

సన్మానం

మరిపెడ రూరల్: మరిపెడ మండలం వీరారం గ్రామానికి చెందిన ట్రాన్స్‌కో అధికారి తక్కెళ్లపల్లి శేషగిరిరావు సతీమణి తక్కెళ్లపల్లి రాజ్యలక్ష్మి ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్‌గా విధులు నిర్వహించి ఇటీవల స్వచ్ఛందంగా పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మిని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నవీన్, మాజీ జెడ్పీటీసీ మంజుల దంపతులు ఆదివారం శాలువాతో ఘనంగా సన్మానించారు. అజ్మీర హరినాయక్, జిల్లా రైతు సమన్వయ సభ్యులు జర్పుల కాలునాయక్ పాల్గొన్నారు.

విగ్రహాల బహూకరణ



చిన్నగూడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో శివపార్వతుల కళ్యాణ మహోత్సవం శనివారం రాత్రి కనుల పండుగగా నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన గాడిపెల్లి జగన్, జీవన్ సోదరులు శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని శివాలయానికి శివపార్వతుల రూ.20వేల విలువైన ఇత్తడి విగ్రహాలను బహూకరించారు.

పురుగు మందు పిచికారీతో ఎండిన పొలం



ఎండిన పొలం చూపిస్తున్న రైతు

పెద్దవంగర: సాగు చేసిన 2ఎకరాల వరి పొలానికి వ్యాధి సోకడంతో పురుగు మందు కొనుగోలు చేసి వాడడంతో ఉన్న పొలం ఎండిపోయింది. ఈ సంఘటన మండలంలోని పోచంపల్లి గ్రామ పరిధిలో చోటుచేసుకుంది. బాధిత రైతు యాకయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పోచంపల్లి గ్రామ పరిధిలోని దేవునిబావి తండాకు చెందిన గుగులోతు హన్మంతు తనకున్న రెండు ఎకరాల్లో వరి పొలం సాగు చేశాడు. ఈక్రమంలో ఇటీవల పోచంపల్లి గ్రామంలో ఓ ఫర్టిలైజర్ షాపులో ఎరువుల కొనుగోలు చేసి పొలంలో చల్లడంతో పొలం కాస్త ఎండి పోయిందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. న్యాయం చేసి ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

రేపు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 21 జిల్లా స్థాయి అథ్లెటిక్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాస నాగమణి ఆదివారం తెలిపారు. యూత్ చాంపియన్ షిప్ ఓపెన్ 400 మీటర్ల, రన్నింగ్ ఉంటుందన్నారు. యూత్ చాంపియన్ షిప్ క్రీడాకారుల వయస్సు వయసు 01-01-2006 నుంచి 31-12-2007 మధ్య జన్మించి ఉండాలని, అండర్-20 విభాగంలో 07-03-2003 నుంచి 2005లో జన్మించిన వారు అర్హులని, అండర్-18 విభాగంలో 07-03-2005 నుంచి 2007 మధ్యలో జన్మించి ఉండాలని, అండర్-16 విభాగంలో 07-03-2007 నుంచి 2009 మధ్య జన్మించి ఉండాలని, అండర్-14 విభాగంలో 07-03-2009 నుంచి 2011 మధ్య జన్మించి వారు అర్హులన్నారు. క్రీడాకారులు తమ ఆధార్, సంబంధింత, ధ్రువపత్రాల జిరాక్స్‌లను తమ వెంట తీసుకురావాలన్నారు. ఆసక్తి కలిగిన వారు జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 21న మంగళవారం ఉదయం 10గంటలకు హాజరుకావాలన్నారు.